# దోస్త్ మేరా దోస్త్


పుప్పాల కృష్ణమూర్తి

అమ్మమ్మ ఊళ్ళో అడుగుపెట్టక ఆరేళ్ళ పైనే అవుతోంది. యింటికి వచ్చినప్పుడల్లా మావయ్యలు, తాతయ్య, అమ్మమ్మ కూడా ఒకలాంటి నిష్టూరమాడుతుండేవారు. 'నువ్వు పెద్దదానివయ్యావులేవే. నీకు మేమెక్కడ కనబడతాం. నువ్వు ముడ్డికి చడ్డి ఏసినప్పట్నుంచీ మా దగ్గరే పెరిగావని మాత్రం మరచిపోకు' అంటుంటారు. కోపంలో అలా అంటారే కాని, అందరికీ నేనంటే ఎంత అభిమానమో! అమ్మ తర్వాత నలుగురు మగపిల్లలే కావడంతో నన్ను కాలు కిందపెట్టనీకుండా పెంచారు.

తాతయ్య మూడూళ్ళ మీద కరణీకం చేసేవాడు. నాకు జ్ఞాపకం వచ్చేటప్పటికే యింట్లో పదిమంది జీతగాళ్ళు, యింటి పనికి ఆడనౌకర్లు వుండేవారు. నన్ను ఎవరో ఒకరు చంకనేసుకుని తిరుగుతుండేవారు. నేను పదిలో వుండగా తాతయ్య కరణీకం లాభంలేదని భూమి కొంత అమ్మేసి లారీలు కొన్నాడు. కొత్త ఫీల్డు, కొత్త స్నేహాలు, కొన్ని దురలవాట్లూ వచ్చాయి. ఇప్పుడు లారీలు లేవు. ఎనభై ఎకరాల ఆస్తి హారతికర్పూరమై పన్నెండెకరాలు మాత్రం మిగిలింది. అది వేరే సంగతి.

సరోజిని అమ్మమ్మన్నా, వాళ్ళ యిల్లన్నా, ఆ ఊరన్నా నాకిప్పటికీ ఎంతిష్టమో చెప్పలేను. ఊరు ముందున్న చెరువు పక్కన ఆరు గదులు, మూడు వరండాలు గల పెద్ద డాబా యిల్లు. యింటి ముందు నైరుతి దిక్కున బావి. ఊరివాళ్లంతా మంచినీళ్ళకు ఆ బావి నీళ్ళే చేదుకుపోతుండేవాళ్ళు. బావి పక్కనే అరటిచెట్లు, పక్కన చిన్న కనకాంబరాల తోట. దాని పక్కనే అరెకరం స్థలంలో నిమ్మ, బత్తాయి, సపోట వంటి తీరొక్కపండ్ల చెట్లు. ఆ చెట్ల పక్కనుంచే పడమరకు పారే ఊరి అలుగు. వరండాలో వాలు కుర్చీ వేసుకుని కూర్చుంటే, తాటి దోనలు తీసుకుని చెరువులో చేపలు పట్టే జాలరులు కనిపిస్తుండేవారు. యింటికి కుడివైపున రెండు పెద్ద రావిచెట్లు, ఊరిముందు గ్రామ దేవతలు కాపలాలా కనిపిస్తుండేవి. చెరువు కట్టకు, యింటికి మధ్యనున్న రోడ్డుగుండా రెండు ప్రైవేటు సర్వీసులు యాత వాకిళ్ళకూ, హుజూర్‌నగర్‌కూ తిరుగుతుండేవి.

అమ్మమ్మ యిల్లు ఊరు ముందుంటుంది గదా. ఇల్లు మలుపు తిరగ్గానే ఎడ



మవైపు మూడో యిల్లే రజియా వాళ్ళది. మా డాబా ఎక్కి చూస్తే రజియా యింట్లో ఏం చేస్తున్నదీ కనిపించేది. నాకు ఒకటో తరగతి నుంచి క్లాస్‌మేటే కాదు, లింగగిరిలో నాకున్న మంచి స్నేహితురాలు కూడా రజియానే. ఉదయం యిద్దరం కలిసి బడికి వెళ్ళేవాళ్ళం. సాయంత్రం బడి వదిలాక, మా డాబా మెట్లమీద కూర్చుని, చెరువులో వాలే కొంగల్ని చూసుకుంటూ, అమ్మమ్మ పెట్టే కజ్జికాయలు, కారప్పూస తినుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ, డాబా మెట్ల పక్కనున్న సన్నజాజి పూల పరిమళం పీల్చుకుంటూ మెల్లగా హోంవర్కు చేసుకునేవాళ్ళం. కల్యాన వేసుకొచ్చిన పట్టులంగా కాడ్నించి, పట్నంలో ఆడే సినిమాదాకా ఎన్ని కబుర్లో! వాళ్ళింట్లో సేమ్యాలు చేసినప్పుడల్లా నన్ను లాక్కెళ్ళి పోస్తుండేది. రంజాన్ పండగొచ్చిందంటే పొద్దుట్నుంచీ, రాత్రిదాకా వాళ్ళింట్లోనే వుండిపోయేదాన్ని. రజియా వాళ్ళమ్మ బస్టాండ్‌లో చిన్న డబ్బాకొట్టు పెట్టుకుని జీవిస్తుండేది. రజియాకొక్కడే అన్న వుండేవాడు గఫారని. ఎప్పుడూ ఏదో ఒక తగాదా కొని తెస్తుండేవాడు. అస్సలు బడికి పోయేవాడు కాదు. బస్టాండ్‌లో ఆవారాగా తిరిగేవాళ్ళని వెంటేసుకుని చేపలకని గాలాలు తీసుకునిపోయేవాడు. అదీ మానేసి, కొన్నాళ్ళు సుతారి పనికి పోయాడు. అదీ వదిలేసి, చౌదరిగారి లారీకి క్లీనర్‌గా కుదిరి తిరుగుతుండేవాడు, డ్రైవరయినంత సంతోషంగా. పాత సినిమాలో రౌడీలాగా మెళ్ళో గళ్ళ దస్తీ కట్టుకుని, కుడి చేతికి వేసుకున్న ఇత్తడి కడాన్ని తిప్పుకుంటూ, బీడీలు కాలుస్తూ, మీసాలు మెలివేసుకుంటూ మొరటుగా మాట్లాడుకుంటూ బస్టాండ్ సెంటర్లో కనిపిస్తుండేవాడు. వాళ్ళమ్మ ఎంత మొత్తుకుని చెప్పినా, లక్ష్యపెట్టేవాడు కాదు. రజియా కూడా నాతో చెబుతూ బాధపడుతుండేది.

ఒకసారి రజియా యింటికెళ్ళేసరికి, ఎండు తునకల్ని పెనంమీద వేయిస్తోంది. నాకవేంటో తెలీదుగాని, ''కమ్మటి వాసనొస్తోంది. ఏంటే రజియా'' అన్నాను, పొయ్యి దగ్గరకు వెళ్ళి.

''కబాబులు తింటావా. బాగుంటాయి తిను'' అని ఒక ముక్కను నోట్లో వేసుకుని కసాపిసా నమలసాగింది. నాకూ నోట్లో నీళ్ళూరాయి. ''ఊ, తిను'' అని ఒక ముక్క నా చేతిలో పెట్టింది. నేనమాంతం నోట్లో వేసుకుని, కాస్త నమిలేసరికి, భళ్ళున వాంతయింది. ఇంతలో వాళ్ళమ్మ వచ్చి అడిగేసరికి, రజియా అసలు సంగతి చెప్పింది. ''కరణమోళ్ళ పిల్లకు కబాబులు పెడతావానె. దొరసానికి తెలిస్తే, నిన్ను నన్నూ చంపిపారేస్తది'' అని పొయ్యి ఊదే ఇనుపగొట్టం తీసుకుని వెంటబడ్డది. రజియా అందకుండా రోడ్డుమీదకు పరిగెత్తింది. నేనేదో చేయకూడని తప్పు చేశానని అర్థమై ఏడుపందుకున్నాను. ''మాఫ్ కరో బేటీ. దాదీసే నహీ బోల్'' అని డబ్బాకొట్లోని జీడీలు, రసగుల్లలు తెచ్చిపెట్టి తినమంది. ఆ విషయం నెలరోజుల తర్వాత బూబమ్మే అమ్మమ్మకు చెప్పింది. నన్నేం కోపగించకుండానే హాయిగా నవ్వేసింది అమ్మమ్మ. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాను. 'మాయింటికాడ ఆడుకుంటాం దొరసాని గారూ ఇందిరను పంపియ్యండి' అని రజియా అడిగితే, 'ఆడుకుంటావా? తీసుకెళ్ళి ఎండు తునకలు పెడతావా?'' అంటుండేది అమ్మమ్మ.

రజియా దోస్తానాతో నాకు ఉర్దూ మాట్లాడ్డం పూర్తిగా వచ్చేసింది. దాంతో హిందీ సబ్జెక్టు ఎంతో ఈజీ అనిపించేది. ఎప్పుడూ డెబ్బై శాతంపైన స్కోర్ చేసేదాన్ని. ఇంటర్ కాగానే హిందీ భూషణ్, విద్వాన్ పరీక్షలు పూర్తిచేసి, హిందీ పండిట్ ట్రైనింగ్ చేసి, జూనియర్ హిందీ పండిట్‌గా సెలక్టయి, ఉద్యోగం తెచ్చుకున్నాను, అది వేరే విషయం.

తొమ్మిదో తరగతి దాకా మా స్నేహం హాయిగా సాగిపోయింది. పదిలోకి ఎంటర్ కాగానే, మా దోస్తానా వెనకబడే పరిస్థితి వచ్చింది. అప్పుడో కుంటిసారు కందిబండ నుండి వచ్చి, మసీద్‌లో అరబ్బీ నేర్పుతానన్నాడట. ''ఇంక నేను తెలుగు బడికి రాను. మా అమ్మ అరబ్బీనే నేర్చుకోమంటోంది. రేపట్నుంచి మజీద్‌కెళ్ళాలి... నువ్వొచ్చుడుగు. మన బడికి పంపిస్తది'' అంది రజియా ఆశగా.

''ఆంటీ. రజియాను తెలుగు బడికి పంపరా?'' అన్నాను కోరికగా.

''చూడు బేటీ. మా ముస్లిం ఆడవాళ్ళకు ఖురాన్ చదువుకోవడానికి అరబ్బీ వచ్చి వుండాలి. రేపు నిఖా చేయాల్సుంటుంది. అప్పుడు ఖురాన్ చదవడం రాదంటే చాలా పెద్ద అవమానం'' అంది.

అప్పుడు నాకదేమీ సరిగా అర్థం కాకపోయినా, యిక నావెంట క్లాసుకు రాదనే విషయం అర్థమైపోయింది. అదే ఏడు యిద్దరు కొత్తమ్మాయిలొచ్చి చేరారు మా క్లాసులో. ఒకరు శ్రీనివాసపురం సులోచన, మరొకరు సర్వారం నుంచొచ్చిన శ్యామల. ఇద్దరూ నా జట్టులో చేరిపోయారు. రజియాకు తీరికున్నప్పుడల్లా మా యింటికొచ్చేది. డాబా మెట్లమీద కూర్చుని సన్నజాజి పూలు కోసుకుంటూ, నేను హైస్కూలు కబుర్లు చెబితే, తను అరబ్బీ నేర్పే పంతులు గురించి, నేర్చుకోవడానికొచ్చే అమ్మాయిల గురించి చెబుతుండేది.

రజియా పెద్దమనిషైన ఫంక్షన్, వాళ్ళమ్మ చాలా నిరాడంబరంగానే చేసింది. అమ్మమ్మ ఒక పంజాబీ డ్రస్ కొని, నాతోనే ఫంక్షన్‌కు పంపింది. అది జరిగిన ఆర్నెల్లకు అమ్మమ్మ నన్ను, రజియాతో స్నేహం బంద్ చేయమని చెప్పింది.

''ఎందుకు?'' అనడిగాను అర్థంగాక.

''నీకన్నీ చెప్పాల్నా? ఆ అమ్మాయి పెద్దదైపోయింది. రేపో, మాపో పెళ్ళిచేస్తారు'' అంది.

'చేస్తే, స్నేహమెందుకు మానేయాలి?''

''అదో మొగుడ్ని చూసుకుంది. నువ్వొకడ్ని చూసుకో సరిపోద్ది'' అంది కోపంగా. అమ్మమ్మ నన్నెప్పుడూ అంత కోపం చేయలేదు. భయంతో నోరు మూసుకున్నాను మాట్లాడకుండా.

ఒకాదివారం రాజేశ్వరి యింటికి వెళుతుంటే, రజియా పిల్చింది. అప్పటికి చాలా రోజులైంది మాట్లాడక. భయంగానే, అమ్మమ్మ చూడ్డంలేదని నిర్ధారించుకుని వెళ్ళాను. ఇంటి వెనక చింతచెట్టు కిందకు తీసుకుపోయింది. వాన చింతకాయలు కోసి, నా గుప్పిట్లో కొన్ని పెట్టి, పక్కన కాస్త మెత్తటి ఉప్పు పెట్టి 'తిను' అంది. చింతకాయలు తింటుంటే అంది. 'నువ్వు మా సార్‌ని చూశావు గదా. ఎలా వుంటాడు?''

''బాగానే వున్నాడు ఎర్రగా. ఒక కాలు కుంటను కుంటా'' అన్నాను నాకేమీ అర్థంగాక.

''అయినా ఏంకాదులే అంది మా. నన్ను షాది చేసుకుంటానంటుండు'' అంది సిగ్గుపడుతూ.

''చేసుకో, నన్ను పిలుస్తావా?'' అన్నాను.

సిగ్గుపడుతూనే తల ఊపింది.

తర్వాత యింట్లో పెళ్ళవుద్దనుకుంటే పెద్ద గోల



యింది.

"మా వాళ్ళకు చెప్పి, నిఖా మాట్లాడ్డానికి వస్తా' అని వెళ్ళిన సారు అట్నుంచటే మీరట్ వెళ్ళిపోయాడట మసీదులో పాఠాలు చెప్పడానికి. గఫార్‌కు ఈ విషయం తెలిసి, కత్తి తీసుకుని యింటిమీదకు పోయి పెద్ద గోల చేశాడట.

"మాదేవుంది. వాడ్ని తీసుకొచ్చుకుని పెళ్ళి చెయ్యండి" అని తప్పుకున్నారట తల్లిదండ్రులు.

గఫార్ లారీమీద మీరట్ పోయి. కొన్ని మసీదులు గాలించాడట. కాని జాడలేదు. ఇంటికి తిరిగొచ్చాడు. ఇంకా గోలచేస్తే. తమదే పరువుపోతుందని ఊరుకుండిపోయారట. రజియానే ఓసారి చెప్పింది.

మోసపోయిన రజియా, కొన్ని రోజులపాటు ఎటూ కదలకుండా యింట్లోనే వుండిపోయింది. క్రమేపీ వాళ్ళ బడ్డీకొట్టు దగ్గర కనిపిస్తుండేది. నేను కనబడితే పిలిచేది. కాని అమ్మమ్మ వెళ్ళకు అని చెప్పడంతో విన్నా, విననట్లే వెళ్ళిపోయేదాన్ని.

నా హైస్కూలు చదువక్కడ అయిపోవడంతో,

**బుల్‌డోజర్ డ్రైవరట. హుజూర్‌నగర్ నుండి యాతవాకిళ్ళ దాకా తారు రోడ్డు పోస్తుంటే, యింట్లో కిరాయికి దిగాడట. ఆర్‌అండ్‌బిలో ఉద్యోగం. అప్పటికే యిద్దరు పిల్లలున్న భార్య కూడా వుందిట. అయినా రజియాను యిష్టపడి చేసుకున్నాడట. గఫార్ తల్లి మీద వేరుపడిపోయి, కోదాడలో కాపురం పెట్టాడట. ఇంకా పిల్లల్లేరట.**

కాలేజీకి ఖమ్మం వచ్చేశాను, రజియాకు చెప్పకుండానే. కాని లింగగిరి నుంచి ఎవరొచ్చినా, రజియా గురించి, వాళ్ళ కుటుంబం గురించి అడుగుతుండేదాన్ని. ఇంటర్ సెకండ్‌లో వుండగా, అమ్మమ్మ చెప్పింది – "ఎవరో ఆర్.ఎం.పి. డాక్టరట. వాళ్ళింట్లోనే కిరాయికి రూం తీసుకుని ప్రాక్టీస్ పెట్టాడట. తన కులం కాకున్నా రజియాను చేసుకుంటానన్నాడట. ఏడాది తర్వాత మళ్ళీ కనిపించకుండా పోయాడట. వాళ్ళన్నయ్య గఫార్ మాత్రం మేనత్త కూతుర్ని చేసుకున్నాడట.

నేనోసారి డిగ్రీ ఫైనల్లో అమ్మమ్మింటికెళ్ళినప్పుడు రజియాకోసం వెళ్ళాను. నన్ను చూసి ఎంత ఆనందించిందో. మెళ్ళో నల్లపూసలు కనిపించాయి. భర్త గురించి అడిగాను.

బుల్‌డోజర్ డ్రైవరట. హుజూర్‌నగర్ నుండి యాతవాకిళ్ళ దాకా తారు రోడ్డు పోస్తుంటే, యింట్లో కిరాయికి దిగాడట. ఆర్‌అండ్‌బిలో ఉద్యోగం. అప్పటికే యిద్దరు పిల్లలున్న భార్య కూడా వుందిట. అయినా రజియాను యిష్టపడి చేసుకున్నాడట. గఫార్ తల్లి మీద వేరుపడిపోయి, కోదాడలో కాపురం పెట్టాడట. ఇంకా పిల్లల్లేరట.

తర్వాత నేను ట్రైనింగ్ కెళ్ళిపోవడం, ఉద్యోగం, పెళ్ళి వెంటవెంటనే జరిగిపోయాయి. కొన్నేళ్ళపాటు లింగగిరి వెళ్ళడమే కుదరలేదు. ఓసారి తాతయ్యకు హార్ట్ స్ట్రోకొస్తే ఖమ్మం తీసుకొచ్చారు. అప్పుడు మావారు, నేను గోకినేపల్లి పి.ఎస్‌లో టీచర్లుగా చేస్తుండేవాళ్ళం. ఇద్దరం హుటాహుటిన తాతయ్యను చూసేందుకు వెళ్ళాం. 'ప్రస్తుతానికి ఫర్వాలేదు. మళ్ళీ రాకుండా చూసుకోండి' అని మందులు రాసిచ్చి జాగ్రత్తలు చెప్పాడు డాక్టర్. అప్పుడు తాతయ్య, అమ్మమ్మ వారం రోజులపాటు అమ్మ వాళ్ళింట్లోనే వుండిపోయారు. నేను రెండు రోజులు మాత్రమే అమ్మమ్మతో గడపగలిగాను. ఆదివారం సాయంత్రం నల్లా దగ్గర మినప్పప్పు కడుక్కుంటూ కబుర్లలో పడ్డాం. అప్పుడే పల్లె విశేషాలు అడుగుతూ, కొట్టు బూబమ్మ కుటుంబం గురించి అడిగాను.

"ఏవోనే అమ్మాయి. ఈ లోకంలో కష్టాలు లేంది ఒక్క రాయిరప్పకేనే. ప్రాణమున్న ఏ జీవయినా కష్టాలు అనుభవించాల్సిందే అని రాస్తాడేమో ఆ భగవంతుడు. ఆ బూబమ్మ మొగుడున్నప్పుడు సుఖపడ్డది లేదు. మొగుడు పోయాక సుఖం లేదు. ఆ కొడుకు కాలేజీకి పోయే బాపనోళ్ళ పిల్లని ఏసుకుని దేశాల మీదకు పోయాడట. ఆ కోడలు కాస్తా అత్త దగ్గరకు చేరింది. యింక ఆ రోలింగ్ డ్రైవర్‌కొచ్చే జీతంలో పెద్దభార్యను పోషించాల్నాయె. పైగా తాగుడు ఎల్లాల్నాయె. యింక ఈ చిన్నామెకేమిస్తాడు? ఇద్దరాడపిల్లల్ని మాత్రం యిచ్చాడు రజియాకు. ఒక డబ్బాకొట్టు మీద యింతమంది బతకాల్నంటే మాటలా? మొదట్నుంచీ నాట్లకు, కలుపులకు పోయినోళ్ళు గాదాయె. ఎవరి జీవితంలోనూ యింత సుఖం లేదు. పుట్టెడు దిగులుతో బతుకుతున్నారు. బూబమ్మే అప్పుడప్పుడూ వచ్చి, బాధలు చెప్పుకుని ఏడుస్తుంటది. నేనే జాలిపడి, బియ్యమో, నూకలో యిచ్చి పంపిస్తుంట. మా సంసారమూ అంతంతమాత్రమేనాయె" అంది అమ్మమ్మ.

ఆ తర్వాత ఆరేళ్ళకి, చిన్న మామయ్య పెళ్ళికోసం బయల్దేరాను లింగగిరి. ఇప్పుడు బస్సులు బాగా పెరిగాయి. ఆటోలు కూడా పోటీపడి తిరుగుతున్నాయి. గతంలో గంటపట్టే ప్రయాణం యిరవై నిమిషాల్లో హుజూర్‌నగర్ నుంచి లింగగిరి చేరుకున్నాం. ఊరు పెద్దగా ఏమీ మారలేదు. ఊరి ముందు ఎస్.సిలకు కాలనీ కట్టించిందట ప్రభుత్వం, మామయ్య చెప్పాడు. రోడ్డుపక్కన గుడిసెలు కొత్తగా కనిపించాయి. బస్టాండ్‌లో డబ్బా కొట్లు మాత్రం పెరిగాయి. అప్పుడు ఒక్క బూబమ్మ కొట్టే వుండేది. పాన్‌లు, సిగరెట్లు, షోడాలు అమ్ముతుండేది. తెలిసిన ముఖం ఒక్కటీ కనిపించలేదు బస్టాండ్‌లో. మూటలు మోసే మదారు మాత్రం గుర్తుపట్టి "బాగున్నారా దొరసానిగారూ. దొరవారు రాలేదా?" అని వినయంగా, బస్సులో సూట్‌కేసు చేతబట్టుకుని, అమ్మమ్మింటికి దారితీశాడు. ఇల్లు చేరగానే పది రూపాయలిచ్చాను. నమస్కారం చేసి 'పెళ్ళి పనులేమన్నా వుంటే పిలవండి దొరసానిగారూ. నేను ఖాళీనే' అని వెళ్ళిపోయాడు రుమాలు తలకు చుట్టుకుంటూ.

ఆ సాయంత్రమే అమ్మమ్మతో "రజియా దగ్గరకు వెళ్ళొస్తా" అన్నాను.

గడియారం వంక చూసి, ఐదున్నర తర్వాత వస్తది, ఆఫీసునుంచి. అప్పుడు వెళ్ళు" అంది.

"ఏంటి? రజియా ఉద్యోగం చేస్తుందా?" అన్నాను సంభ్రమంగా.

"అవునే. వాళ్ళాయన పోయాడు గదా. ఉద్యోగమిచ్చారు" అంది అమ్మమ్మ.

నాకు చాలా సంతోషమేసింది. ఆరింటికి రజియాను వెదుక్కుంటూ వెళ్ళాను. మొదట నన్ను నిర్ఘాంతపోయి చూసి, తర్వాత కౌగిలించుకుని గట్టిగా ఏడ్చింది. నా చేతులు తీసుకుని ముద్దుపెట్టుకుంది. ఇంతలో వాళ్ళమ్మ వచ్చి, 'వచ్చావా బేటీ. ఎన్నాళ్ళయింది నిన్ను చూసి. ఈ గరీబోళ్ళింటికి ఎంత దయతో వచ్చావమ్మా' అని ముఖమంతా చేతుల్లోకి తీసుకుని, తలకు మెటికలు విరుచుకుంది. గఫార్ భార్య వచ్చి, నాకు వినయంగా నమస్కారం చేసింది. అందరం చాపలమీద కూర్చున్నాం. నన్నందరూ అడ్మైరింగ్‌గా చూస్తూ, ఏవేవో పెట్టాలని, నాకోసం ఏవేవో తయారు చేయాలని హడావిడిపడిపోసాగారు. నేను వారించాను. అయినా వినకుండా అప్పటికప్పుడు సేమ్యాలు తయారుచేసి ముందు పెట్టింది. బాబు, నేనూ తృప్తిగా తిన్నాము. రెండు గంటలపాటు బూబమ్మ, రజియా తాము పడ్డ కష్టాలు పూసగుచ్చినట్టు చెప్పారు.

ముందు గఫారే టి.బితో చనిపోయాడట. నల్లగొండ దాకా తీసుకెళ్ళి చూపించారట. కాని సరైన పత్యం చేయలేకపోయాడట. తర్వాత రెండేళ్ళకు రజియా భర్త కామెర్లయి చనిపోయాడట. జి.పి.ఎఫ్, పెన్షన్ బెనిఫిట్స్ వగైరా పెద్దభార్య తీసుకునేట్లు, ఉద్యోగం చిన్నభార్యకు చెందేలా ఒప్పందం చేసుకున్నారు. ఆర్ అండ్ బి ఆఫీసులో అటెండర్‌గా ఉద్యోగమిచ్చారు. చేయబట్టి మూడేళ్ళవుతోంది. పిల్లల్ని చూపించింది. ఉత్సాహంగా, ఆరోగ్యంగా వున్నారు. ప్రైవేటు స్కూలుకు పంపుతోంది పట్నానికి. బడ్డీకొట్టు అత్తా, కోడలు చూసుకుంటున్నారట. ఇప్పుడింట్లోనే మిషన్ పెట్టుకుని షోడాలు పట్టుకుంటున్నారు. అంతా కలిసే వుంటున్నారట. జీతంలోంచి రజియా ఓ యాభైవేలు చిట్టీ కడుతోందట. బూబమ్మ కొట్టుమీద పాతికవేల చిట్టీ వేసిందట. వాళ్ళ నవ్వుల నయాగరాలో స్నానించి, నా అడ్రసిచ్చి, ఖమ్మం వచ్చేటప్పుడు తప్పక యింటికి రమ్మని చెప్పి వచ్చాను.

"అమ్మమ్మా. ఇప్పుడెంత బాగుందోనే రజియా. నేను గుర్తేపట్టలేదు. మా ధనలక్ష్మి టీచర్‌లా వుందనుకో. బూబమ్మ ముఖంలో కూడా ఎంత కళ. గఫార్ భార్య ఎక్కువ మాట్లాడలేదు గాని, ఉన్నంతలో మట్టసమైన మనిషే అనిపించింది. అసలా కుటుంబంలోనే ఏదో కొత్త కళ వచ్చినట్లనిపిస్తోంది. చిన్నప్పటి ముచ్చట్లు చెప్పుకుని కడుపుబ్బ నవ్వుకున్నాం" అన్నాను యింటికి రాగానే.

"ఆ ముండాకొడుకులిద్దరూ చచ్చారుగా. దాంతో వీళ్ళ శని వదిలింది. వాళ్ళుండంగ ఏముంది...? వీళ్ళను పీక్కుని తినుడేనాయె. అనుంగ తిన్నది లేదు. సరైన బట్టగట్టింది లేదు. జీవితమంతా కష్టపడ్డా బూబమ్మకు మాత్రం ముసలితనంలో సుఖమే దక్కిందిలే" అంది అమ్మమ్మ బాణిలోంచి పకోడీలు తీస్తూ.

నేను తృప్తిగా తలాడించి, ఓ పకోడి అందుకున్నాను.

★